# భవిష్యత్‌పై చర్చను రేకెత్తించింది

విప్లవ పోరాటాల ఫలితాల గురించి విప్లవకారులను అడిగితే రాజకీయ కోణం నుండి జవాబు వెతుకుతారు. ఆ పోరాటం అనుసరించిన వ్యూహం ఫలవంతమైనదా, విప్లవ లక్ష్యాన్ని అది ముందుకు తీసుకుపోయిందా ఇత్యాది ప్రశ్నలు వేసుకుంటారు.

ఈ ప్రశ్నకు జవాబు వేరే కోణం నుండి కూడా చెప్పుకోవచ్చు. పోరాటాలను అణచడానికి ఎంత అవసరమో అంత బలప్రయోగం చేసిన ప్రభుత్వం ఆ పోరాటాలు తిరిగి బలం పుంజుకోకుండా ఉండడానికి ప్రవేశపెట్టే సంస్కరణలు, ఇక పెత్తనం సాగదని గుర్తించిన పెత్తందారీ వర్గాలు అనుసరించే కొత్త పోకడలు, ప్రజలకు ఏడవడమే కాదు తిరగబడడమూ చేతనవునని గుర్తించాక సమాజం అలవరచుకునే ఆదర భావము – ఇవన్నీ ప్రజల జీవితంపైన ప్రభావం వేసే ఫలితాలే.

గ్రామీణ పేద ప్రజలకు సంబంధించి మన రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు 1970లలో వచ్చాయి. వాటిలో ఆదివాసులకు సంబంధించినవి ప్రత్యక్షంగా శ్రీకాకుళ పోరాటం నుండి పుట్టినవి కాగా తక్కినవి చాలావరకు నక్సలైట్ ఉద్యమాన్ని రాజకీయంగా ఎదుర్కొనడానికి చేపట్టినవి. మన దేశంలో మొదటి విడత భూగరిష్ఠ పరిమితి (సీలింగ్) చట్టాలను వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు 1950లలో చేయగా, సీలింగ్ తగ్గించిన రెండవ విడత చట్టాలను నక్సలైట్ ఉద్యమం ఫలితంగానే చేపట్టామని కాంగ్రెస్ నాయకులు స్వయంగా ఒప్పుకున్నారు. అది తన ముందుచూపు ఫలితమేనని పి.వి.నరసింహారావు గర్వంగా కూడా చెప్పుకున్నారు. పేదలకు భూములు పంచకపోతే హరిత విప్లవం ఎర్రబడే ప్రమాదం ఉందని గుర్తించినట్టు కూడా వారు చెప్పుకున్నారు.

శ్రీకాకుళ పోరాటం ఆదివాసీ పోరాటం కావడం వల్ల ఆదివాసీ ప్రజల మేలుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కొన్ని సంస్కరణలు చేపట్టక తప్పలేదు. ఆదివాసులు తమకు వరంగా భావించే 'వన్ ఆఫ్ సెవెన్టీ' (1/70) రెగ్యులేషన్ దీనిలో ముఖ్యమైనది. అంతకు ముందు కూడా ఆదివాసీ భూములను గిరిజనేతరులు కొనుగోలు చేయడాన్ని నియంత్రించే చట్టం ఉండింది. అయితే అది బలహీనంగా ఉండింది. కలెక్టర్ (ఏజెంట్) అనుమతితో కొనుగోలు చేసే అవకాశం ఉండింది. 'వన్ ఆఫ్ సెవెన్టీ' దానిని తొలగించడమే కాక మరికొన్ని కీలకమైన మార్పులు కూడా తెచ్చింది. అప్పటికే ఏజెన్సీలో గిరిజనేతరులు చాలా భూమి ఆక్రమించుకున్నారు కాబట్టి ఇక వాళ్ళు భూమిని పొందలేకుండా చేసిందది. గిరిజనేతరులు గిరిజనుల నుండే కాదు, గిరిజనేతరుల నుండీ, ప్రభుత్వం నుండీ కూడా భూమి పొందడానికి వీలు లేకుండా చేసింది. భూమి బదలాయింపుపై విచారణలు అంతకుముందు కూడా అప్పుడప్పుడు జరిగాయి గానీ 1970 తరువాతే పెద్ద సంఖ్యలో కేసులు చేపట్టడం జరిగింది. అధికభాగం కేసులు గిరిజనేతరులకు అనుకూలంగా ముగిసినప్పటికీ 1 లక్ష 30 వేల ఎకరాల దాకా గిరిజనేతరుల నుండి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ఐటిడిఏ ఏర్పాటుకూడా శ్రీకాకుళ పోరాటం ఫలితమే. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, 'ఏజెన్సీ' ఉన్న అన్ని రాష్ట్రాలలోనూ ఐటిడిఏలు ఏర్పాటయ్యాయి. పాలనా యంత్రాంగానికి సహజమై పోయిన అవినీతి వల్ల ఆశించినంత ఫలితం రాకపోయినప్పటికీ విద్య, వ్యవసాయం, స్వయం ఉపాధి పథకాలు మొదలయిన రంగాల్లో ఐటిడిఏ వల్ల మేలు జరిగిందనే చెప్పుకోవచ్చు. మన రాష్ట్రంలోనైతే ఏజెన్సీ ప్రాంతంలో పాలన యావత్తు ఐటిడిఏ ద్వారా జరుగుతుండడం వల్ల సమస్యలు చెప్పుకోవడానికీ, ఫిర్యాదులు చేయడానికీ పాలన అందుబాట్లోకి వచ్చినట్లయింది.

సమాజం విషయానికొస్తే ఆదివాసుల పట్ల చులకన భావం, ఏం చేసినా చెల్లుతుందనే అహంకారం ఇతర వర్గాలలో తగ్గాయనే చెప్పుకోవచ్చు. శ్రీకాకుళ పోరాటంతో ఆదివాసీ ప్రాంతాలలో ప్రారంభమైన పోరాటాలు ఆదివాసీ యువతకు బయటి ప్రపంచపు తలుపులు తెరిచాయి. విప్లవం చూపించిన ప్రపంచమేకాక ఇంకా చాలా వారి అనుభవంలోకి వచ్చింది. మేల్కొలిపిన వారు ఉద్దేశించిన దాన్ని మించిన మేల్కొలుపు వచ్చింది. తాము ఏమిటి, తమ భవిత ఏమిటి అన్న చర్చ వారిలో మొదలయింది. ఆ చర్చ విప్లవకారులు ఉద్దేశించిన దిశలో సాగకున్నా సరే ఆదివాసులకయితే చాలా మేలు చేస్తుంది. పోరాటాల ఫలితంగా వచ్చిన సంస్కరణలలో భాగంగా, ఏజెన్సీ విద్యాలయాలలోని అధ్యాపక పదవులు నూటికి నూరుశాతం ఆదివాసులకే రిజర్వ్ కావడం వల్ల ఒక ఆదివాసీ మేధావి వర్గం ఏర్పడింది. ఆ వర్గం ఆదివాసీ ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన చర్చలో నిర్ణాయక పాత్ర వహించడం ఇప్పటికే మొదలైంది.

–కె.బాలగోపాల్